

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వాంకిడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియమకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గణిత శాస్త్రం-1 పోస్టు ఖాళీగా ఉందని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం, ఇతరులు 55 శాతం మార్కులు పీజీలో కలిగి ఉండాలని అన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని ఈ నెల 16 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మహేందర్

వాంకిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రానికి చెందిన ప్రేంసాగర్‌కు సోమవారం తాను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అందించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రేంసాగర్ మార్కెట్ ఏరియాలో ఫోన్ పోవడంతో వాంకిడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ నయీం పాల్గొన్నారు.

మద్యం వ్యాపారుల సిండికేట్



- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- టెండరు దక్కించుకునేందుకు వ్యూహం
- గ్రూపుల ఏర్పాటు, టెండరు వేసేందుకు చర్యలు
- ముందస్తు ఒప్పందాలు చేసి పెట్టుబడులు పెడుతున్న వైనం

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మద్యం టెండరు 2025-27లో భాగంగా జిల్లాలో 32 దుకాణాలకు ప్రక్రియ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 18 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో 16, కాగజ్‌నగర్ డివిజన్‌లో 16 దుకాణాల కేటాయింపునకు అధికారులు టెండర్లు నిర్వహిస్తున్నారు. కాగా ఇప్పటివరకు కాగజ్‌నగర్ డివిజన్‌లో-20 టెండర్లు, ఆసిఫాబాద్ డివిజన్‌లో-80 టెండర్లు దాఖలయ్యాయి.

కాగజ్‌నగర్‌లోని మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మరినట్లు తెలుస్తోంది. పట్టణంలో మద్యం వ్యాపారంలో కింగ్‌మేకర్లుగా ఎదిగిన కొంత మంది ముఠాగా ఏర్పడి గ్రూపులను ఏర్పాటు చేశారు. ఈ వ్యాపారులే ఆసక్తి ఉన్న వారితో అప్పులిచ్చి పెట్టుబడులు పెట్టిస్తున్నారు. మూడు లక్షల రూపాయల నగదు ఇచ్చి టెండరు వేసేట్టు పలు రహస్య ఒప్పందాలు చేస్తున్నారు. ఇందుకు పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆసక్తి ఉన్న వారు ఈ గ్రూపుల్లో చేరుతున్నారు. అయితే ఇందుకు పెట్టుబడి వీరిదే, టెండరులో దుకాణం వస్తే వీరు చెప్పిన నిబంధనలు తప్పకుండా పాటించాల్సిందే. వీరు ఎవరికి దుకాణం ఇవ్వాలన్న వారికి ఇవ్వాల్సిందే.

ఒకవేళ దుకాణం రాకపోతే పెట్టుబడి డబ్బులు వాయిదా పద్ధతిలో ఇచ్చేటట్టు ఒప్పందం చేసుకుంటున్నారు. మద్యం వ్యాపారుల మాయాజాలం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రక్రియతో రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం గండిపడే అవకాశాలుండటంతో పోలీసులు రంగప్రవేశం చేసి పలువురు వ్యాపారులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వాకబు చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

● విదేశీ పర్యటనలు సైతం..

కాగజ్‌నగర్ డివిజన్‌లో కింగ్ మేకర్లు చెప్పింది వినాల్సిందే. లేదంటే తరుచూ రాష్ట్ర టాస్క్‌ఫోర్సు దాడులు జరిగేట్టు చేయటం, తరుచూ ఫిర్యాదులు చేస్తుండటంతో ఎందుకీగొడవ అనుకొని పలువురు వ్యాపారులు సర్దుకుపోతున్నారు. పలువురు వ్యాపారులు ఆయా దుకాణాలకు సంబంధించిన మద్యం బాటిళ్లను బెల్టు షాపులకు తరలింపు చేయటం, ఎలాంటి సమస్యలు వచ్చిన కూడా వీరే పరిష్కరిస్తున్నారు. దీంతో ఈ వ్యాపారం వీరి కనుసన్నల్లోనే నడుస్తోంది. కాగా ఏ ఇతర వ్యక్తులు కూడా ఈ వ్యాపారంలోకి రాకుండా వీరే చూసుకుంటున్నట్టు కూడా ప్రచారం జరుగుతోంది. మద్యం దుకాణాల టెండరు ప్రక్రియపై ఇప్పుడు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వ్యాపారుల అడుగులపై పక్కాగా నిఘా పెడుతున్నారు. గ్రూపులో ఉన్న సభ్యులకు బంపర్ ఆఫర్లు ఇస్తున్నారు. ఇందులో కూడా విదేశీ పర్యటన ఖర్చులు కూడా భరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వీరి వ్యాపారం చేజారకుండా ఉండేందుకు కూడా వీరు పక్కా ప్రణాళికలతో అడుగులు వేస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఎలాంటి ఫిర్యాదులు రాకపోవటంతో అధికారులు కూడా ప్రేక్షక పాత్ర వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన క్రీడా పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థినులు జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జంగు, పీడీ మీనారెడ్డి తెలిపారు. ఈ నెల 11న వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిలో చిక్రమ్ జంగ్‌బాయి, కుమ్ర నాగేశ్వరి, సోయం వైష్ణవి, జె సరోజ ఉన్నారు. విద్యార్థినులతో పాటు కోచ్ తిరుమల్‌ను గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్దవ్, గిరిజన క్రీడల అధికారి షేకు, జీసీడీవో శకుంతల, ఏటీడీవో చిరంజీవి, హెచ్‌డబ్ల్యూవో సాయిబాబా, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్‌లు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్‌కు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ వర్ధంతిని సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చిరంజీవి, శంకర్, మహేష్, రాకేష్, వికాస్, రాకేష్ పాల్గొన్నారు.

రెబ్బెన: గోలేటిలో సోమవారం మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ 5వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ ఆశయాల కొనసాగించాలన్నారు. సీపీఐ గోలేటి పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, కార్యదర్శి తిరుపతి, సీపీఐ మండల గ కార్యదర్శి నర్సయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పౌష్టిక ఆహారంపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెంటుబాయి అన్నారు. పోషణ మాసం వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆసిఫాబాద్ మండలం మోవాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మతాశిశు మరణాలను తగ్గించవచ్చని అన్నారు. కిశోరబాలికలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పోషణలోపం ఉన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజావాణికి 68 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 68 దరఖాస్తులు వచ్చాయి. అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రె అర్జీదారుల నుంచి దఖాస్తులు స్వీకరించారు.

కెరమెరి మండలం గోయగాం గ్రామానికి చెందిన ముస్లీం మైనార్టీ మహిళలు తమ గ్రామం ఏజెన్సీ పరిధిలో ఉన్నందున గిరిజనేతర గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దహెగాం మండలం బీబ్రా గ్రామానికి చెందిన తిరుపిగౌడ్ తాను గతంలో కొనుగోలు చేసిన భూమిని తన పేరిట పట్టా మంజూరు చేయాలని, సిర్పూర్(టి) మండలం లోనవెల్లికి చెందిన దేవాగడె మయూరి తాను పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశానని, దివ్యాంగురాలు అయిన తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైనూరు మండలం సుంగాపూర్‌కు చెందిన షెడ్యూల్డ్ తెగల కోలాం వాసులు తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, లింగాపూర్ మండలం పిక్లాతండాకు చెందిన రవీందర్ తన పొలంలో అడవి పందులు పంటను ధ్వంసం చేశాయని నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు. తిర్యాణి మండలం నాయకపుగూడ గ్రామానికి చెందిన లక్ష్మీ తన పట్టా భూమిలో ఇతరులు అక్రమంగా ఫెన్సింగ్ వేస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

● **రెబ్బెన:** మండలంలోని మాదువాయిగూడ-కాగజ్‌నగర్‌కు వెళ్లే రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు మాజీ జడ్పీటీసీ సభ్యుడు పల్లె ప్రకాష్‌రావు వినతిపత్రం అందజేశారు. మదువాయిగూడ నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లే రహదారి సౌకర్యం లేక పోవటంతో సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. మాజీ సర్పంచ్‌లు పర్వతాలు, ముంజం రవీందర్, బీమాన్కర్ సుధాకర్, అల్లం సంతోష్, అర్జు, చౌదరి తదితరులు ఉన్నారు.

● రెబ్బెన మండలం దేవుళ్లగూడ ప్రాంతంలో జాతీయ రహదారిపై ఉన్న యూ టర్న్ మూసివేయడంతో ఆసుపత్రికి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దానిని పునరుద్ధరించాలని కోరుతూ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు మాజీ జడ్పీటీసీ సంతోష్, సోమయ్య, విమలేష్, శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు.

బాధితులకు సత్వర న్యాయం జరగాలి

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ఆసిఫాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత సీఐలకు ఫోన్‌లో సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా ప్రజలకు మరింత దగ్గరయ్యేలా జిల్లా పోలీసు శాఖ పని చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని అన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

ఆదివాసీ పర్ధాన్ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు, దుర్భాషలాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా నాయకులు ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో తిర్యాణి మండలం మంగి గ్రామానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి పర్ధాన్ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు, దుర్భాషలాడడన్నారు. ఆ వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతిసే విధంగా ఉన్నాయని వెంకటేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వందన, బుదబాయి, ప్రేంకుమార్ తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు థామస్, మల్లేష్, శ్రీశైలం, శ్రీనివాస్, సుదర్శణ్, శంకర్, విజయ్, రవీందర్, భాగ్యలక్ష్మి, రామయ్య, వెంకటేష్, ప్రభాకర్, ఇస్లాంటీస్ హసన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి 'గాలికుంటు'టీకా పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 15 నుంచి నవంబరు 14 వరకు నెల రోజుల పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా పశు వైద్యాధికారి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులకు, ఎద్దులకు, గేదెలకు, దున్నపోతులకు, దూడలకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

చింతలమానేపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన ఎర్రం స్వామి సతీమణి ఎర్రం లలిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు పలువురు నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, శేఖర్, మునావర్‌ఖాన్, మాణిక్‌రావు, విజయ్, కిరణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో నాకా బందీ

రెబ్బెన, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఎస్సై ఆధ్వర్యంలో నాకా బందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన దారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేవుగూడలో వైద్య శిబిరం

జైనూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుగూడలో వైద్య సిబ్బంది సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు రక్త పరీక్షలతో పాటు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు.

పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని హెల్త్ సూపర్‌వైజర్ రమేష్ గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈవో జాదవ్ రమేష్, హెల్త్ ఆసిస్టెంట్లు ప్రవీణ్ కుమార్, జంగు, ఆశా వర్కర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో పత్తికి నష్టం



పత్తి పంట చేనులో నిలిచిన వరదనీరు (ఫైల్)

పంట దిగుబడిపై రైతుల ఆందోళన

సిర్పూర్(టి), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల మూలంగా పత్తి, కంది పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసినా పత్తి కాయలు నల్లబారి పూత రాలిపోతుందని ఈ ప్రాంత రైతులు దిగాలు చెందుతున్నారు. క్రమం తప్పకుండా వర్షం కురవడంతో పెన్‌గంగా పరివాహక ప్రాంతాలైన హుడ్కిలి, జక్కాపూర్, పారిగాం, టోంకిని, వెంకట్రావుపేట, లక్ష్మీపూర్, నవేగాం, సిర్పూర్(టి) ప్రాంతాల్లో పత్తి చేనుల్లో నీరు నిలవడం, మరో వైపు చెట్లు సన్నగిల్లడం తదితర సిర్పూర్(టి) మండలంలో 16 గ్రామ పంచాయతీల పరిధిలోని 27 గ్రామాల్లో ఈసారి పత్తి పంట 15 వేల ఎకరాల్లో, ఐదు వేల ఎకరాల్లో వరి, మరో వెయ్యి ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఈసారి కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో వరద నీటితో నది ఉధృతంగా ప్రవహించడంతో పరివాహక ప్రాంతాల్లో ఉన్న పత్తి, కంది, మిరప పంట సాగు చేసిన రైతులు పెట్టుబడి కూడా నష్ట పోతామోనని ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ఆదుకోవాలని రైతులు కోరుతు వాటితో ఈసారి పత్తి పంట దిగుబడి అంతంత మాత్రంగా ఉండవచ్చని రైతులు భావిస్తున్నారు. కొన్నిప్రాంతాల్లో పత్తి పంట ఆశాజనకంగా ఉన్నా దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. దీంతో పాటు ఈ సారి వరి పంట అనుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్త వ్యక్తం చేస్తున్నారు. పత్తి ఏరివేతకు ఇప్పటి నుంచే హర్యానా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ నుంచి కూలీలు వలస వస్తున్నారు.

నష్టపరిహారం కోసం ఎదురుచూపులు..

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పెన్‌గంగా బ్యాక్ వాటర్ కారణంగా సిర్పూర్(టి), నవేగాం, జక్కాపూర్, హుడ్కిలి, పారిగాం తదితర ప్రాంతాల్లో పత్తి పంట నష్ట పోయింది. దీంతో వ్యవసాయాధికారులు సర్వేలు సైతం నిర్వహించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు. ప్రభుత్వం స్పందించి పరిహారం ఇస్తుందా లేదా అని ఎదురు చూస్తున్నారు.

షీ టీంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత

పెంచికలపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో షీ టీం సభ్యులు మహిళల భద్రతపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత విద్యార్థినులకు భద్రతా చట్టాలు, అపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 100, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైనట్లయితే వెంటనే కాగజ్‌నగర్ షీ టీం 8712670565 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు గంగాభవానీ, లక్ష్మీ, భాగ్యశ్రీ, నాగరాణి, ఉజ్వల, షీలా, షీ టీం సభ్యులు రమాదేవి, శ్రీనివాస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని డీవైఎస్ఓ క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 వాలీబాల్ బాలుర జిల్లా జట్టు ఎంపిక పోటీలను సోమవారం నిర్వహించామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. ఈ పోటీల్లో 12 మంది క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందని ఈ నెల 14 నుంచి నిర్మల్ జిల్లాలో జరిగే జోనల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో ఆఫీక్ షైమద్, హెచ్ఎం కర్రు, క్రీడాధికారి షేక్‌పేట కార్యదర్శి కృష్ణమూర్తి, పీడీ మీనారెడ్డి, కోచ్‌లు రాకేష్, పీడీ, పీఈటీలు రాజయ్య, ల్మణ్, పరమశివ, శ్రీనివాస్, సుభాష్, ఏడుకొండలు, కోచ్‌లు రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన జట్టుతో పీడీలు, పీఈటీలు

జ్యోతిభాపూలే ఆశయ సాధనకు కృషి



నివాళులు అర్పిస్తున్న మాలి సంఘం నాయకులు

వాంకిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వాసు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాలి సంఘం జెండాను ఆవిష్కరించి జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రతీ గ్రామంలో మాలి కులస్థులు జ్యోతిబాపూలే వారోత్సవాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, ఓమాజీ, హనుమంతు, మాలి కులస్థులు పాల్గొన్నారు.

వేతనాలు అందించాలి

జైనూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు ముందే ఈజీఎస్, ఆశ వర్కర్లు, ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వేతనాలు అందించాలని కొలాం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం రాజు కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎనిమిది నెలల నుంచి వేతనాలు రాక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు రావడానికి నెలలు పడుతుండటంతో కిరాణా వ్యాపారులు ఉద్దెర ఇవ్వడం లేదని ఆయన అన్నారు. ఇతర శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగలకు నెలనెలా వేతనాలు ఇస్తున్నారని, చిరుద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి పాటిస్తోందని విమర్శించారు. అధికారుల స్పందించి వేతనాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. కొలాం సంఘం నాయకు ఆత్రం బాపూరావ్, సిడాం ముత్త, ఆత్రం పోచిరాం తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపీడబ్ల్యూ మృతి

కెరమెరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేస్లాగూడ గ్రామ పంచాయతీలో కొన్నేళ్లుగా ఎంపీడబ్ల్యూ(మల్టీపర్పస్ వర్కర్) గా పనిచేస్తున్న కోవ ప్రభు ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య సావిత్రిబాయి ఉన్నారు. ప్రభు కొన్నేళ్లుగా ఆదిలాబాద్, మహారాష్ట్రలోని పలు ఆసుపత్రులలో వైద్యం పొందినప్పటికీ ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై ఇంట్లో మృతి చెందాడు. దహన సంస్కారాల కోసం కార్యదర్శి హరీష్ పదివేల నగదును అందజేశారు.

కొనసాగుతున్న మరమ్మతులు

బెజ్జూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని సోమిని, కుశ్నపల్లి గ్రామాల వరకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో ప్రారంభించిన రోడ్డు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం పనులను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు.



పనులు లేక మూతపడిన సీఎఫ్‌సీ

- ప్రభుత్వ ఆర్డర్లు లేక కార్మికులకు ఉపాధి కరువు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఆందోళనలో కార్మికులు

వాంకిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న మండల కేంద్రంలోని కామన్ ఫెసిలిటి సెంటర్ (సీఎఫ్‌సీ) ప్రభుత్వ ఆర్డర్లు లేక మూతపడింది. దీంతో పనులు జరగక కార్మికులకు ఉపాధికరువైంది. గతంలో 60 మందికి పైగా కార్మికులకు ఉపాధినందించిన ఈ పరిశ్రమ నేడు పనులు లేక ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ పరిశ్రమపైనే ఆధారపడ్డ కార్మికులు ఉపాధి దొరకక వీధిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు పనులతో కళకళలాడిన పరిశ్రమ నేడు ప్రభుత్వ ఆర్డర్లు లేక వెలవెలబోతుంది. గతేడాది అక్టోబరు వరకు కార్మికులు పనులు కొనసాగగా అప్పటి నుంచి ఎలాంటి ప్రభుత్వ ఆర్డర్లు కార్మికులకు పనులు లేక ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు దృష్టి సారిస్తే పరిశ్రమకు పూర్వవైభవం రానుంది.

ప్రభుత్వ ఆర్డర్లు లేక కరువైన ఉపాధి...

2012లో పనులు లేక ఈ పరిశ్రమ సంక్షభంలో చిక్కుకుంది. అప్పటి నుంచి జూలై 2015 వరకు పరిశ్రమ మూతపడింది. దీంతో పరిశ్రమపై ఆధారపడ్డ కార్మికుల ఉపాధిని కోల్పోవల్సి వచ్చింది. ఆతరువాత అప్పటి ఐటీడీఏ పీఓ ఆర్‌వీ కర్ణన్ సీఎఫ్‌సీని సందర్శించి పరిశ్రమను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకున్నారు. రూ. ఆరు లక్షల కార్పస్ నిధులను మంజూరు చేసి సీఎఫ్‌సీని పునర్‌ప్రారంభించారు. తరువాత ప్రభుత్వ అర్డర్లు లేకపోవడంతో తిరిగి పరి శ్రమ మూతపడింది. మూడేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ రూ. 4.50 లక్షల బెంచీలు తయారు చేసేందుకు ఆర్డర్ ఇవ్వడంతో కొన్ని నెలల పాటు పరిశ్రమ కొనసాగింది. తరువాత ఆర్డర్లు లేక తిరిగి మూతపడింది. ఒకప్పుడు పనులతో కళకళలాడిన పరిశ్రమ నేడు ప్రభుత్వ అర్డర్లు లేక వెలవెల బోతుంది.

గత రెండేళ్ల క్రితం పరిశ్రమ మూతపడి ఉండగా అప్పటి ఐటీడీఏ పీవోగా పనిచేసిన వరుణ్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చాహత్‌బాజ్‌పాయ్ సీఎఫ్‌సీ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని మూడు లక్షల రూపాయల విలువ చేసే కలప తయారీకి ఆర్డర్ ఇవ్వడంతో పరిశ్రమ తిరిగి తెరుచుకుంది.

అనంతరం బెంగుళూరుకు చెందిన బెల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమి టెడ్) కంపెనీ నుంచి రూ. 34 లక్షల విలువ చేసే 500 డ్యూయల్ డెస్క్‌లు ఆర్డర్ రావడంతో తిరిగి పరిశ్రమ గాడిన పడింది. అనంతరం పెద్దపల్లి జిల్లా నుంచి రూ. 13 లక్షల పనులకు ఆర్డర్లు రావడంతో గతేడాది అక్టోబరు వరకు పనులు కొనసాగాయి. ప్రస్తుతం ఆర్డర్లు లేకపోవడంతో కార్మికులు పనులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తే సీఎఫ్‌సీకి పూర్వవైభవం వచ్చే అవకాశం ఉంది.

ఫర్నిచర్ తయారీలో కార్మికులు దిట్ట..

1971లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయంలో రాష్ట్రంలో 56 సీఎఫ్‌సీ(కామన్ ఫెసలిటీ సెంటర్) కేంద్రాలను ప్రారంభించారు. అందులో భాగంగానే అప్పటితాలుకా కేంద్రమైన వాంకిడిలో 9 వేల రూపాయలతో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కలపతో అందమైన వస్తువులు తయారు చేయడంలో ఇక్కడి కార్మికుల ప్రతిభ అమోఘం. భవనాలకు అమర్చే తలుపులు, కిటికీలు, టేబుల్లు, సోఫాసెట్‌లు, రాకింగ్‌చేర్లు, డైనింగ్ టేబుల్, డ్రెస్సింగ్ టేబుల్, తదితర వస్తువులు తయారు చేస్తారు. వాటి రూపకల్పనలో కార్మికు లు తమ ప్రత్యేకతను ప్రదర్శిస్తారు. కలపతో ఫర్నీచరే కాకుండా ఇనుముతో బీరువాలు, బెడ్‌లు, డ్యూయల్ డెస్క్‌లు తదితర వస్తువులు తయారుచేస్తుంటారు. ప్రస్తుతం కలప దొరకకపోతుండడంతో ఇనుముతోనే వస్తువులను తయారు చేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

: రాము, కార్మికుడు



పరిశ్రమ ప్రధానంగా ప్రభుత్వ ఆర్డర్లపై అధారపడి కొనసాగుతుంది. ఆర్డర్లు ఉన్న సమయాల్లో కార్మికులకు ఉపాధి దొరుకుతూ పనులులేని సమయంలో కార్మికులకు ఉపాధి కరవుతుంది. ఈ పరిశ్రమపై ఆధారపడి ఉన్న తమకు ప్రస్తుతం పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాము. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ అర్డర్లు అందించి ఆదుకోవాలి.

ప్రభుత్వ ఆర్డర్లు రావడంలేదు...

మడావి పైకాజీ, పర్యవేక్షకుడు



సీఎఫ్‌సీకి ప్రభుత్వ ఆర్డర్లు రాకపోవడంతో ఉపాధి తగ్గింది. గతంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఫర్నీచర్ ఆర్డర్లు వచ్చేవి. దీంతో 60 మంది కార్మికులకు ఉపాధి కలిగేది. గతేడాది వరకు అధికారులు ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వడంతో పనులు సాగాయి. ప్రస్తుతం ఆర్డర్లు లేకపోవడంతో పనులు లేక మూతపడింది. సీఎఫ్‌సీకి ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నాము.

టేకు చెట్లు నరికిన వ్యక్తి అరెస్టు


రాజేష్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

దండేపల్లి/జన్నారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలంలోని తానిమడుగు అటవీ బీట్ పరిధిలో ఇటీవల టేకు చెట్లు నరికిన కేసులో పెందూర్ రాజేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో సుష్మారావు వెల్లడించారు. నిందితుడిని ఆదివారం లక్షెట్టిపేట కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ అతడికి 12 రోజులు పాటు రిమాండ్ విధించినట్లు ఎఫ్ఆర్‌వో వెల్లడించారు. ఎఫ్ఆర్‌వో తెలిపిన వివరాల ప్రకారం తానిమడుగు అటవీ బీట్ పరిధిలో ఇటీవల టేకు చెట్లు నరికారని అధికారులకు సమాచారం అందింది. దీంతో తాళ్లపేట ఎఫ్ఆర్‌వో సుష్మారావు పర్యవేక్షణలో రెంజ్ సిబ్బంది డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేపట్టారు. చెట్లు నరికివేసిన ప్రదేశం వద్ద లభించిన ఆధారాలను డాగ్ హంటర్‌కు వాసన చూపించారు. దీంతో నాలుగు కిలోమీటర్ల దూరం వరకు తానిమడుగులోని పెందూర్ రాజేష్ ఇంటి వరకు ట్రాక్ చేయగా, అతని ఇంటి వద్ద టేకు కలప లభించింది. దీంతో రాజేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. అతపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నాటు సారా స్థావరాలపై దాడులు


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కోటపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపూర్, సర్వాయిపేట, ఎసన్‌వాయి గ్రామాల్లోని నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి తెలిపారు. అబ్కారీ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదిలాబాద్ హిమశ్రీ ఆదేశాల మేరకు నాటుసారా విక్రయ, తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించామని సీఐ తెలిపారు. నాటుసారా విక్రయిస్తున్న శంకరాపూర్‌కు చెందిన పుప్పాల రాకేష్‌పై, నాటుసారా తయారుచేస్తున్న సర్వాయిపేటకు చెందిన గుగులోత్ సమ్మపై, ఎసన్‌వాయి గ్రామానికి చెందిన ఆజ్మీర నవీన్‌కుమార్‌పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది రవి, అశ్వక్, సందీప్, జమీర్, సరోజన తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోనవెల్లిలో రాత్రి పేకాట ఆడుతున్న ఎనిమిదిని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై కందూరి రాజు తెలిపారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు లోనవెల్లి గ్రామంలో అలూరి ప్రకాష్ ఇంటి ఆవరణలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకుని వారి నుంచి 17,670 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఇంటి యజమానితో పాటు మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుళ్లు విజయ్, రమేష్, హోంగార్డు శేఖర్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

బెజ్జూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన బోర్కూట్ మల్లయ్య అనే వ్యక్తి పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఇటీవల మల్లయ్య ఇంటి పక్కన ఉన్న దంపతులతో గొడవ జరిగింది. దీంతో దంపతులు మల్లయ్యపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయింది. కాగా మల్లయ్య ఆత్మహత్యాయత్నానికి అదే గ్రామానికి చెందిన బషరత్‌ఖాన్ కారణమంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. తనను కావాలనే ఆ వ్యక్తి కేసులో ఇరికించి పోలీసు కేసు పెట్టించాడని మల్లయ్య మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయమై ఎస్సై సర్తాజ్ పాషాను సంప్రదించగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ విషయమై ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. బాధితుడిని కుటుంబసభ్యులు చికిత్స కోసం బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

3.05 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని వీరూర్‌కు తరలిస్తున్న 3.05 క్వింటాళ్ల రేషన్ బియ్యంను సిర్పూర్(టి) రైల్వే స్టేషన్‌లో అక్రమంగా పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్‌లు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు రైల్వే స్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీ చేయగా అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 3.05 క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. నిందితులు పారిపోయినట్లు తెలిపారు. బియ్యంను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాలతో కలసి ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ప్రధానమంత్రి జన్ మన్ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవతం చేయాలని, లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులకు మంజూరైన బేసిమెంట్ లెవల్ వరకు పూర్తి చేసిన వారి ఖాతాల్లో విడతల వారీగా నగదు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా అందిస్తుందని లబ్ధిదారులు అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. స్లాబ్ స్థాయి వరకు పూర్తయిన ఇళ్లను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి జన్ మన్ పథకం కింద 2,167 మంది లబ్ధిదారులను గుర్తిం చడం జరిగిందన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఇళ్ల పనులను మరింత వేగవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పంచాయతీ రాజ్ ఇంజనీర్లు, రోడ్డు భవనాలు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో చేపట్టిన రహదారులు, కల్వర్టులు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి భవనం నిర్మాణాన్ని డిసెంబరు నెలా ఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రభుత్వ కార్యాలయాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. రహదారులు, కల్వర్టుల మరమ్మతులకు నివేదిక అందించాలని జిల్లా అభివృద్ధి పనులలో స్థల సమస్యలు ఉన్నట్లయితే తహసీల్దార్‌ల సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ ఉపాధిహామీ పథకం పనుల జాతరలో మంజూరైన వంటశాల, బాలికల మూత్రశాలల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షతి, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

మళ్లీ పెద్దపులి కదలికలు

- మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి ప్రవేశం- ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

పెంచికలపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత నది పరివాహక ప్రాంతంలో పులి కదిలికలు ఉన్నాయని అటవీ అధికారులు గుర్తించారు. ఏ క్షణానైనా జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉందని అటవీ అధికారులు ముందుగానే గుర్తించి అటవీ ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. అధికారులు అనుకున్నట్లుగానే పులి కదిలికలు కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతం మీదుగా దహెగాం మండలం వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్‌ను సంప్రదించగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత తీర ప్రాంతంలో నుంచి పులి జిల్లాలోకి ప్రవేశించిందని పెంచికలపేట రేంజ్ పరిధి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పిల్లలా... పులేనా...

ప్రాణహి పరివాహక ప్రాంతంలో సంచరిస్తున్న పులితో పాటు పులి పిల్ల కూడా ఉందని అధికారులు వారం రోజుల క్రితమే గుర్తించారు. అయితే ఇప్పుడు జిల్లాలోకి ప్రవేశించిన పులి అదేనా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా పులి కలయిక సమయంలో క్రూరంగా ప్రవర్తిస్తూ మనుషులపై దాడి చేస్తుంది. కానీ పిల్ల పులి అంతకంటే ప్రమాదకరంగా ఉంటుందని నిపుణులు తెలుపుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిసున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపులి సంచరిస్తున్నందున దహెగాం మండల ప్రజలు అప్రమత్తంగా ఉడాలని అటవీ శాఖ సిబ్బంది అన్నారు. సోమవారం దహెగాం మండలం పెసరికుంట, పోలంపల్లి, మురళీగూడ గ్రామాల్లో పులి అడుగులను గుర్తించినట్లు తెలిపారు. బీబ్రా, జెండాగూడ, దుబ్బగూడ, పోంపల్లి, మురళీగూడ గ్రామాల్లో పులి సంచారం ఉన్నందున ప్రజలు గుంపులుగా వ్యవసాయ పనులకు వెళ్లాలని సూచించారు. పులి కాగజ్‌నగర్ మండలం సార్సాల నుంచి పెద్దవాగు దాటి పెసరికుంట గ్రామం మీదుగా పొలంపల్లి, మురళీగూడ గ్రామాల వైపు వెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంచికలపేట, రెబ్బెన మండలాల అటవీ అధికారులు పాల్గొన్నారు.



దహెగాంలో పులి అడుగులను గుర్తిస్తున్న అధికారులు, పెంచికలపేటలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అడవి పందుల దాడిలో పత్తి పంటలు ధ్వంసం

- పరిహారం అందించాలని రైతుల డిమాండ్


ధ్వంసమైన పంటను పరిశీలిస్తున్న ఏవో, గ్రామస్థులు

కోటపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంపేట గ్రామంలో ఆదివారం రాత్రి పత్తి చేన్లలో అడవి పందులు పడి పంటను ధ్వంసం చేశాయి. పత్తి చేన్లు సమీప అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో వందలాది అడవి పందులు గుంపులుగా వచ్చి పంటలను ధ్వంసం చేసి నేలపాలు చేశాయని బాధిత రైతులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. పంట నుంచి పత్తి కాయలను వేరు చేయడంతో పాటు పంటలను తొక్కడంతో సుమారు 50 ఎకరాల్లోని పంటలు ధ్వంసమయ్యాయి. గ్రామానికి చెందిన దుర్గం బక్కయ్య, మద్దెల స్వామి, తాళ్ల రమేష్, దుర్గం సంతోష్, పాయిడ మహేష్, ఇరుగురాల రాజబాబు, మునిగెం పోశం, దుర్గం తిరుపతి, కోర్కి తార, గడ్డం మధునయ్య, కామెర సంపత్‌తో పాటు ఇతర రైతులకు చెందిన పంటచేన్లలో పందులు పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు పంట చేన్లకు వచ్చి లబోదిబోమంటూ కన్నీరు పెట్టారు. అటు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వగా బీట్ అధికారి నరేష్, వ్యవసాయాధికారులు సాయికృష్ణ, ఏఈవో వైష్ణవి పంటలను పరిశీలించారు. మరోసారి అటవీ అధికారుల వైఖరిని నిరసిస్తూ బాధిత రైతులు ఆందోళనకు సిద్ధం కాగా పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని రైతులను సముదాయించారు. అటవీ శాఖకు చెందిన ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా అక్కడ కు రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పంటలను అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయని అధికారులు సర్వే చేసి తమకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు.



సింగరేణి సమాచారం

సీఎంపీఎఫ్ సమస్యలకు సత్వర పరిష్కారం



రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ పత్రాలు అందజేస్తున్న అధికారులు

మందమర్రిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన సీఎంపీఎఫ్ (భవిష్యనిధి)తో పాటు పెన్షన్‌కు సంబంధించిన సమస్యలుంటే పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని హైద్రాబాద్ సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్-1 హరిపచౌరి తెలిపారు. సోమవారం స్థానిక జీఎం కార్యాలయంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్ అధ్యక్షతన సీఎంపీఎఫ్‌తో పాటు రివైజ్డ్ పీపీవో (పెన్షన్ పేమెంట్) అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ పత్రాలను సిద్ధం చేశామన్నారు. మూడు నుంచి నాలుగు దశాబ్దాల పాటు సింగరేణిలో పనిచేసిన ఉద్యోగులకు సత్వర సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యామన్నారు. ఏమైనా సమస్యలుంటే అందుబాటులో ఉన్న గని అధికారులను సంప్రదించాలని సూచించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం వెనువెంటనే సీఎంపీఎఫ్, పెన్షన్‌ల సమస్యలను పరిష్కరించేందుకు సంక్షేమాధికారులతో పాటు అధికారులతో సమావేశాలను నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నా మని వివరించారు. ఈ సందర్భంగా 500లకు పైగా రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు ఆసిఫ్, గోవర్ధన్, శంకర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, నాయకులు అక్బరలీ, రమణ, లింగయ్య, గనుల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

అదనపు ఉత్పత్తిని సాధించాలి

సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు


కేకే ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

మందమర్రిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంతో పాటు అదనపు ఉత్పత్తి సాధించాలని సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఏరియాలోని కేకే ఓసీపీని సందర్శించారు. ఓసీపీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా సాధిస్తున్న ఉత్పత్తిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక వర్షాలు కురిసినందున బొగ్గు ఉత్పత్తికి కొంత అంతరాయం కలిగిందన్నారు. నష్టపోయిన ఉత్పత్తిని తిరిగి సాధించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. ప్రమాదరహిత ఉత్పత్తి కోసం రక్షణసూత్రాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. ప్రమాదాలు లేని సింగరేణిగా చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. సింగరేణిలో ఉద్యోగులు గైర్హాజరు కావద్దని, గైర్హాజరైతే సంస్థతో పాటు కుటుంబం కూడా ఆర్థికంగా నష్టపోతుందని వివరించారు. గతంలో గైర్హాజరైతే సమయం ఇచ్చేవారని, ప్రస్తుతం నిబంధనలు మారాయని, ఒక్కసంవత్సరం వంద మస్టర్లు లేకపోతే డిస్మిస్ అవుతారని తెలిపారు. సంస్థలో అధిక వేతనాలు ఉన్నందున కష్టపడి పనిచేసి కుటుంబాల సంక్షేమానికి పాటు పడాలని సూచించారు. జీఎం రాధాకృష్ణ, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, ఇంజనీర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

క్రీడల్లో సింగరేణికి పేరు తేవాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏరియా ఫైనాన్స్ మేనేజర్

రెబ్బెన, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి క్రీడాకారులు క్రీడల్లో రాణించి సింగరేణికి పేరుతేవాలని ఏరియా ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్ సూచించారు. సోమవారం గోలేటి సింగరేణి క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల ఉద్యోగ క్రీడాకారులు ప్రతిదినం నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ సమష్టిగా పోటీల్లో పాల్గొని కోల్ ఇండియా స్థాయిలో రాణించాలన్నారు. గతంలో పతకాలు సాధించిన సీనియర్ క్రీడాకారులు అభినందించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, డబ్ల్యూపీఎస్ జీఏ కార్యదర్శి ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కో ఆర్డినేటర్ అన్వేష్, జనరల్ క్యాప్టెన్ కిరణ్, పీడీ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేని సమాజం నిర్మిద్దాం

శ్రీరాంపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అవినీతికి తావులేని సమాజం నిర్మిద్దామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సమాచార హక్కు చట్టంపై జీఎం కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు పారదర్శకత, బాధ్యతను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, ఆర్‌కే 5, 6 ఏజెంట్ శ్రీధర్, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, డీజీఎం(స్టోర్స్) మల్లయ్య, ఏరియా సర్వే అధికారి నర్సింగరావు, ఆర్‌కే 7 మేనేజర్ తిరుపతి, ఎస్ఆర్‌పీ 3 మేనేజర్ వెంకట్రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఎస్టేట్స్ అధికారి మహేష్, సీనియర్ పీవోలు కాంతారావు, మురళి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

కదిలిన అధికార యంత్రాంగం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



కాసిపేట మోడల్ హాస్టల్‌లో వంటలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

కాసిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మోడల్‌హాస్టల్‌లో నీళ్ల పప్పు ఉడకని అన్నం శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతితో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. సోమవారం జిల్లా సెక్టోరియల్ అధికారి విజయలక్ష్మీ, జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ హాస్టల్‌ను సందర్శించి వంటలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిల్లులు రావడం లేదనే సాకుతో పిల్లలకు నాణ్యత లేని భోజనం పెట్టడంపై స్పెషల్ ఆఫీసర్ సరితపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. దీనిపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

బెల్లంపల్లి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ తెలిపారు. హైదరాబాద్‌లోని కోటి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. టీసీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ పార్లమెంటు సభ్యులు బీబీ పాటిల్, ప్రధాన కార్యదర్శిగా గురువా రెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రేంచందర్ రెడ్డిలను సభ్యుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

తైక్వాండోలో రాష్ట్ర స్థాయిలో రజిత పతకం



శశివర్ధన్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

హాజీపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 7న లక్షెట్టిపేటలో నిర్వహించిన జోనల్ స్థాయి అండర్-14 తైక్వాండో పోటీలలో రివిలేషన్ పాఠశాల విద్యార్థి నాగుల శశివర్ధన్ ప్రథమ స్థానం సాధించాడు. అనంతరం నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొని రజత పథకాన్ని దక్కించుకున్నాడు. విద్యార్థి విజయంపై పాఠశాల కరస్పాండెంట్ రాపోలు విష్ణువర్ధన్ రావు, ప్రిన్సిపాల్ మద్దెర్ల ప్రశాంత్‌లు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థి శశివర్ధన్ తల్లిదండ్రులు సౌందర్య, శ్రీనివాస్‌లను, శిక్షకుడు జి అరుణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

ఎస్టీ జాబితా నుంచి వలస లంబాడాలను తొలగించాలి

కాసిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ జాబితా నుంచి వలస లంబాడాలను తొలగించేంత వరకు ఆదివాసీల ఉద్యమం ఆగదని ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడె జంగు ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగ విరుద్ధంగా ఎస్టీ జాబితాలో చేర్చిన లంబాడీలను తొలగించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ నెల 15న తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి, 20న కలెక్టరేట్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేత, 30న ఐటీడీఏ కార్యాలయాల అధికారులకు వినతి పత్రాలు అందజేత, నవంబర్ 9న ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. డిసెంబర్ 9న ఆసిఫాబాద్‌కొమురంభీం జిల్లా కేంద్రంలో మరో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మరో విడత వచ్చేశాయి..



పుస్తకాల పంపిణీని పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

ఎంఆర్‌సీలకు చేరుకున్న పార్ట్-2 పాఠ్య పుస్తకాలు

రేపటి నుంచి విద్యార్థులకు పంపిణీ

నెన్నెల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం రోజునే మొదటి విడత పాఠ్య పుస్తకాలు అందజేశారు. రెండో విడత టెక్స్‌బుక్స్‌ను ఈ నెల 15 నుంచి అందజేయనున్నారు. జిల్లా కేంద్రం లోని గోదాం నుంచి ఎంఆర్‌సీలకు పుస్తకాలను పంపిస్తున్నారు. దాదాపు అన్ని మండల విద్యా వనరుల కేంద్రాలకు అవసరమైన పుస్తకాలు చేరుకున్నాయి. అక్కడి నుంచి పాఠశాలలకు చేర వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి హెచ్‌ఎంల ద్వారా పిల్లలకు రెండో విడత పాఠ్య పుస్తకాలు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు.

జిల్లాకు 94,180 పార్ట్-2 పాఠ్య పుస్తకాలు


మంచిర్యాల జిల్లాలో 715 పాఠశాలలు ఉన్నాయి. 510 ప్రాథమిక, 97 ప్రాథమికోన్నత, 108 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 35,306 మంది పిల్లలు చదువకుంటున్నారు. మొదటి విడతలో 3,07, 550 పుస్తకాలకుగాను 3,00033 పుస్తకాలను పంపిణీ చేశారు. రెండో విడతలో 94,180 పుస్తకాలు అవసరంగా గుర్తించారు. ఇప్పటికి 87,780 పుస్తకాలు మండలాలకు చేరుకోగా, 6400ల పుస్తకాలు ఇంకా రావాల్సి ఉంది. కస్తూర్బా విద్యాలయాలు, ఆదర్శ, మైనార్టీ గురుకుల లాంటి ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌లో చదివి విద్యార్థులకు జూన్‌లోనే అన్ని పుస్తకాలు ఇచ్చారు. ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు పార్ట్-2 పుస్తకాలను అందివ్వనున్నారు.

తప్పిన పాత పుస్తకాల బాధ

గతంలో విద్యాసంవత్సరం ప్రారంభమైన మూడు నాలుగు నెలల వరకు పాఠ్య పుస్తకాలు వచ్చేవి కావు. సీనియర్ల పాత పుస్తకాలతో సర్దుకునే పరిస్థితి ఉండేది. ఈ సారి అందుకు భిన్నంగా సకాలంలో పాఠ్యపుస్తకాలను అందిస్తున్నారు. పాఠశాలల పునః ప్రారంభం రోజునే బ్యాగు నిండా పుస్తకాలు, నోటు బుక్కులు అందించారు. దసరా సెలవులు ముగిసిన వెంటనే పార్ట్-2 టె క్స్‌బుక్స్ పంపిణీ చేయడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బైలింగ్వల్‌తో ప్రయోజనం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఓవైపు తెలుగు, మరోవైపు ఇంగ్లీషులో పాఠాలను ముద్రించిన బైలింగ్వల్ పుస్తకాలను ఈ సారి కొత్తగా ఇచ్చారు. వాటితో తమకు చదవడం సులభమవుతుందని విద్యార్థులు అంటున్నారు. రెండు భాషల్లోని పదాలను, వాక్య నిర్మాణాన్ని, అర్థాన్ని పోల్చుకోగలుగుతున్నా మని చెప్పారు. పుస్తకాలపై సీరియల్ నంబరు, క్యూ ఆర్ కోడ్ ముద్రించారు. ఈ విధానంతో పుస్తకాలు పక్క దారి పట్టకుండా ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.



పార్ట్-2 పుస్తకాలను ఎమ్మార్సీలకు చేరవేశాం..: యాదయ్య, జిల్లా విద్యాధికారి



మొదటి విడత పాఠ్య పుస్తకాలను పాఠశాలల పునః ప్రారంభం రోజే అందజేశాం. ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌కు ఈ పాటికే అన్ని టెక్స్‌బుక్స్ అందాయి. ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు పార్ట్-2 పుస్తకాలను అందివ్వనున్నాం. జిల్లాకు పార్ట్-2 పుస్తకాలు 94,180 అవసరం కాగా, 87,780 వచ్చాయి. మండల విద్యా వనరుల కేంద్రాలకు పుస్తకాల పంపిణీ కొనసాగుతోంది. ఒకటిరెండు రోజుల్లో హెచ్‌ంఎంలు పిల్లలకు పాఠ్యపుస్తకాలను అందజేస్తారు.

మధుకర్‌ది రాజకీయ హత్యే

కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

మందమర్రిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి నియోజకవర్గంలోని వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్య పూర్తిగా రాజకీయ హత్య అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మధుకర్ రాజకీయ ఎదుగుదలను చూసి తట్టుకోలేకనే ఆత్మహత్యకు పాల్పడేలా అక్రమంగా కేసులు పెట్టి నానా రకాలుగా వేధించారన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారించి ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మధుకర్ ఎంత మానసిక వేదన పడ్డాడతో ఆయన రాసిన సూసైడ్ నోట్ చూస్తే అర్థమవుతుందన్నారు. మధుకర్ కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. ప్రజల కోసం పనిచేసే అధికారులు పార్టీల కోసం, అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకవద్దని సూచించారు. మధుకర్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తామన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని అందరు గుర్తుంచుకోవాలన్నారు.



మాట్లాడుతున్న దుర్గం అశోక్

మెప్మా రుణాలపై కొత్త మెలిక...

(5వ పేజీ తరువాయి)

ఖాతా వివరాలను నమోదు చేయాలి. సంస్థ ప్రధాన వ్యాపార కార్యకలాపాల వివరా లను, దాని ఎస్‌ఐసీ కోడ్‌తో సహా నమోదు చేయాలి. సబ్మిట్‌పై క్లిక్ చేసే ముందు నమోదు చేసిన సమాచారం సరియైనదిగా నిర్ధారించుకోవాలి. జనరేట్ అయిన ఉద్యోగుల రిజిస్ట్రేషన్ (యూఆర్ఎన్) కోసం రిజిష్టర్డ్ ఈ-మెయిల్, చిరునామా, మొబైల్ నెంబర్‌ను తనిఖీ చేయాలి. యూఆర్ఎన్‌ను ఉపయోగించి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ నుంచి ఈ-సర్టిఫికేట్ లేదా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

రూ. 257 కోట్ల రుణాల మంజూరుకు...

జిల్లా వ్యాప్తంగా వ్యాపారాలు చేసేందుకు చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు వీలుగా మెప్మా సభ్యులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 25757.93 కోట్ల రుణాలు ఇవ్వా లనే లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూరు, క్యాతన్‌పల్లి, లక్షెట్టిపేట, మంచిర్యాల, మందమర్రి, నస్పూర్ మున్సిపాలిటీలలో మొత్తం 5614 మెప్మా సంఘాలు ఉన్నాయి. వీటిలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు (ఎస్ హెచ్‌జీ) 5363, స్లమ్ లెవల్ ఫెడరేషన్ (ఎస్ఎల్ఎఫ్)లు 244, టౌన్ లెవల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్)లు 7 ఉన్నాయి. ఆయా సంఘాల్లో మొత్తం 56,130 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలోని మొత్తం ఎస్‌హెచ్‌జీల నుంచి ఈ ఏడాది 1049 గ్రూపులకు రూ. 257 కోట్ల 57 లక్షల 93వేల రుణాలు మంజూరు చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. జిల్లాలోని బ్యాంక్ లింకేజీ కలిగిన సంఘాలకు పై రుణాలను అందజేస్తారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు రుణాలు తీసుకునే ప్రతీ సభ్యురాలు ఉద్యమ్ ఆధార్ ధృవీ కరణ పత్రాన్ని కచ్చితంగా పొంది ఉండాలి. ధృవీకరణ పత్రాలు పొందేందుకు సంఘాల సభ్యులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

సిబ్బంది సహాయం తీసుకోవాలి...

రాజు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్



ఉద్యమ్ ఆధార్ పొందడం కోసం సంఘాల మహిళలు సంబంధిత సీవో, ఆర్పీల సహాయ సహకారాలు తీసుకోవాలి. ఉద్యమ్ ఆధార్ కోసం సహాయం చేసే సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది.

స్వయం సహాయక సంఘాలలోని ప్రతీ మహిళ ఉద్యమ్ ఆధార్ కలిగి ఉండటం తప్పనిసరి. ఉద్యమ్ ఆధార్ పొందడం వల్ల మెప్మా రుణాలను సులభంగా పొందేందుకు వీలు కలుగుతుంది.

స.హ చట్టం రాష్ట్ర అధికార ప్రతినిధిగా సతీష్ కుమార్

బెల్లంపల్లి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కాసి సతీష్‌కుమార్ ఎన్నికయ్యా రు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షుడు సూర స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా కాసి సతీష్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన సతీస్‌ను రిటైర్డ్ జడ్జి నేరెల్ల మల్యాద్రి సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ భూపాల్, సీనియర్ హైకోర్టు న్యాయ వాది నర్సింహారావు మెమోంటో అందజేసి శాలువాతో సన్మానించారు.

బియ్యం అందజేత

బెల్లంపల్లి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 26న తిలక్‌వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సామూహిక వివాహ మహోత్సవానికి సోమవారం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆర్థిక సాయంతో పాటు 4క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ తిలక్‌వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతుండడం గొప్ప విషయమన్నారు. అలాగే ఉచిత సామూహిక వివాహ మహోత్సవం నిర్వహించడం అభినందనీయమని, ఎల్లవేలలా ఎలాంటి సాయమైన చేస్తానని పేర్కొన్నారు. తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రంగ రామన్న, రత్నం రాజం, నగేశ్, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో ల్యాబ్ ప్రారంభం

చెన్నూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని ఎస్‌పీవాడ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఏఎక్స్ఎల్ ఏఐ నూతన ల్యాబ్‌ను ఎంఈవో దత్తకుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ల్యాబ్ ద్వారా 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితంలో మెళకువలు నేర్చుకోవడానికి ఉపయో గపడు తుందన్నారు. మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా విద్యార్థుల్లో సృజ నాత్మకతను పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడు తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయండి

దండేపల్లి అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చక్కటి విద్యబోధన అందించి వారి ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి మంత్రి రాజు సూచించారు. దండేపల్లిలో విద్య వనరుల కేంద్రంలో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పార్ట్2 టెక్స్ బుక్స్‌లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎంఈవో చేతుల మీదిగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదువుకోని ఉన్నత స్థానంలో నిలువాలని, అప్పుడే వారికి మంచి భవిష్యతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోర్విచెల్మ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దుర్గం చిన్నయ్య, ఎంఐసీ నగేష్, సీఆర్‌పీలు సురేందర్, నర్సయ్య ఉన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

సబ్ కలెక్టర్‌కు గిరిజన రైతుల వినతి

కాసిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దనపల్లి శివారు ప్రాంతంలోని భూములను అటవీశాఖ అధికారులు నిర్బందంగా భూములు లాక్కుంటున్నారని, తమ భూములు తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కు రైతులు వినతి పత్రం అందించారు. బాధిత రైతులు మాట్లాడుతూ 1977లో ప్రభుత్వం రైతులకు అసైన్‌మెంట్ ద్వారా భూములను అందించిందన్నారు. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల కాలంలో అటవీ శాఖ అధికారులు ఆ భూముల్లో ఫారెస్టు బౌండరీ లైన్ పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమకు హక్కు పత్రాలు ఉన్నా అటవీ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. తమభూములు తమకు ఇప్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రైతులు అంజయ్య ,రౌతు సత్తయ్య, సమ్మయ్య, లింగమూర్తి, తిరుపతి, దేవక్క పాల్గొన్నారు.



బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న పెద్దనపల్లి గిరిజన రైతులు

నిరుపేదలకు సేవ చేయడమే క్లబ్ లక్ష్యం

రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ వెంకటకృష్ణ

లక్షెట్టిపేట, అక్టోబరు, 13(ఆంధ్రజ్యోతి): మన చుట్టు నిత్యం తిరుగుతున్న నిరుపేదలను గుర్తించి వాళ్లకు ఉపాధి మార్గం చూపుతూ సేవలందించడమే రోటరీ క్లబ్ ముఖ్య లక్ష్యం అని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ వెంకటకృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి లక్షెట్టిపేట క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపరిసర ప్రాంతంలో రోటరీ క్లబ్ అంటే బాశెట్టి చంద్రగుప్త అని ఆయన హయాంలో ఈప్రాంతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని ఇక్కడి ప్రజలకు ఆయన ద్వారానే రోటరీ పరిచయం అయ్యిందని గొప్పగా చెప్పుకోవచ్చునన్నారు. సీనియర్ రోటరీ చంద్రగుప్తను అభినందిం చారు. అనంతరం దండేపల్లి లక్షెట్టిపేట మండలాల్లో చిరు వ్యాపారులు వాళ్ల వ్యాపారాలు చేసుకునేందుకు వీలు గా ఉండేందుకు తోపుడు బండ్లను అందజేస్తామన్నారు. ఈతోపడు బండ్ల పంపిణీకి సహక రించిన కరీంనగర్‌కు చెందిన రోటరీయన్ కొ త్తపల్లి అరవింద్ సహకారంతో వ్యాపారులకు అందిస్తామన్నారు.

సుమారు 20మంది వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేసారు. ఈకార్యక్రమంలో మంచిర్యాల జిల్లా రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాదాసు శ్రీనివాస్, సభ్యులు పల్లెర్ల మనోహర్, జిల్లా సత్తయ్య, నరేందుల బీమన్న, దండేపల్లి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు ఎనుగూరి వేణు, పాలకుర్తి సుదర్శన్, సతీష్, ఆర్, శ్రీనివాస్, గందం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ఉనికి కోసమే బీఆర్ఎస్ తపన

కాసిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ తన ఉనికిని కాపాడుకోవడానికి కాంగ్రెస్ బాకీ కార్డుతో ఊరూరా తిరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రదీప్ పేర్కొన్నారు.

సోమవారం కొండాపూర్ యాప వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆదరణ కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఊరూరా తిరుగుతూ కాంగ్రెస్ బాకీ కార్డులు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. పదేళ్లలో ప్రజలకు ఏమిచేయలేని కేసీఆర్‌ను గద్దె దించి ఫాంహౌజ్‌కే పరిమితం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన డబుల్‌బెడ్‌రూంలు శిథిలావస్థకు చేరుకున్నాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్లు కట్టించి నీడ కల్పిస్తుందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ఆదరణ చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని సీట్లను గెలిచి సత్తా చాటుతుందన్నారు.

ఈ సమావేశంలో ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ నాయకులు మైదం రమేష్, ఉత్తూరి సత్తయ్య, ముత్యాల రాజమౌళి, భుక్య రవి, గోలేటి స్వామి, దుర్గం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో హోమియోపతి ఉత్తమం

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో హోమియోపతి వైద్యం మెరుగైందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ ఆయుష్ పథకం కింద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హోమియోపతి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుర్వేదం, యునాని, అల్లోపతి లాంటి అనేక ప్రత్యామ్నాయ వైద్య విధానాల ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని, మధుమేహం, రక్తపోటు, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో హోమియోపతి మెరుగైన ఫలితాలను ఇస్తుందన్నారు. హోమియోపతి వైద్యం అతి తక్కువ ఖర్చుతో కూడుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అనిత, వైద్య శిబిరం ఇన్‌చార్జీ డాక్టర్ స్పందన తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమీకృత భవన సముదాయంలో ఏర్పాటు చేసిన సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు. సీపీఆర్ ప్రాముఖ్యత, సీపీఆర్ చేయడంపై వైద్యాధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీపీఆర్ చేయడం ద్వారా రక్త ప్రసరణ పునరుద్ధరించబడడం, మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు ప్రత్యూష, శ్రీలత, కోటేశ్వర్ రావు, సుధాకర్‌నాయక్, ప్రసాద్, శివ ప్రతాప్, అధికారులు వెంకటేశ్వర్లు, తాహెరుద్దీన్, అబ్దుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను అరెస్ట్ చేయాలని నిరసన

వేమనపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ వేమనపల్లి మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహ త్యకు కారకులైన వారిని పోలీసులు తక్షణమే అరెస్టు చేయా లని నాగారం గ్రామస్తులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నాగారం గ్రామ చౌరస్తాలో గ్రామస్థులందరు ఏకమై నిరసన చేపట్టారు. మాజీ జడ్పీటీసీ తలండి భీమన్న మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే ఒక బీసీ నాయకుడు మధుకర్‌పై అక్ర మంగా అన్యాయంగా కేసులు పెట్టి మానసికంగా ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన కాంగ్రెస్ నాయకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు కొన్ని రాష్ట్రాల్లోనే దొరల పాలన ఉండేదని అటువంటి దొరల పాలన వేమపల్లి మండలంలో తాము చూస్తున్నామన్నారు. ఇప్పటికైనా మేధావులు, యువకులు ఆలోచన చేసి ఇటువంటి రాజకీయ నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామంలోని గిరిజన దళిత నాయకులు, యువకులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కాసిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరి పంటలను ఆశించే చీడపీడల నివారణపై సోమవారం మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పుడు వరి పిలక దశ నుంచి పొట్టదశలో ఉందని, ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను బట్టి పంటలో బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు, ఆకుముడత పురుగు ఎక్కువగా ఆశిస్తుందన్నారు. వీటి నివారణకు యూరియా వాడకాన్ని తగ్గించాలని, పురుగుల ఉధృతి నివారణకు స్ప్రే మందులను పిచికారీ చేయాలన్నారు. పంటల్లోఏమైనా సందేహాలుంటే ఏఈవోలను సంప్రదించాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటే

మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు

లక్షెట్టిపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవటే అని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. మండలంలోని జెండవెంకటాపూర్ గ్రామంలో సోమవారం మాజీ మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అబద్దపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. సుమారు 420 హామీలు ప్రజలకు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కానీ బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ముందుంటుందని ఇప్పటి వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ప్రజలకు అవసరం ఉన్న ప్రతీ పథకం ఎధావిధిగా అందించిందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలపై విడుదల చేసి బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెల్తపు సుధాకర్, యూత్ అధ్యక్షుడు గంగాధర్, మాజీ ఎంపీటీసీ దావిద్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

మంచిర్యాల కలెక్టరేట్ : ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. సోమవారం మంచిర్యాల కార్పోరే షన్‌లోని 43వ డివిజన్‌లో కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీని కూడా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

భీమారం: మడల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ కలగూర రాజ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ బాకీ కార్డులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు





నేడు నీల్వాయికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

వేమనపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీల్వాయి గ్రామానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు రానున్నట్లు మండల బీజేపీ నాయకులు కంపెల అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్య చేసుకోగా ఆయన కుటుంబాన్ని నీల్వాయిలోని ఇంటికి వెళ్లి పరామర్శించనున్నారని తెలిపారు. రైలు ద్వారా మంచిర్యాలకు చేరుకుని అక్కడ నుంచి నీల్వాయికి వస్తారని తెలిపారు. మధుకర్ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం రామగుండం సీపీని కలిసి మధుకర్ ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్టు చేయాలని కోరనున్నట్లు తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాల క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ పురుషుల గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక (గెస్ట్) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ఆర్సీవో శ్రీధర్ కళాశాల ప్రిన్సిపాల్ కె పురుషోత్తం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉన్న వారు అర్హులని, ఈ నెల 17వ తేదీ శుక్రవారం మంచిర్యాల జిల్లాలో నిర్వహిస్తున్న సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో జరిగే డెమో, ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తివివరాలకోసం 9603 705803, 8977568214 సంప్రదించాలని తెలిపారు.

వర్షంతో పత్తికి నష్టం 8
● పంట దిగుబడిపై రైతుల ఆందోళన

మెప్మా రుణాలపై కొత్త మెలిక..



- రుణం పొందే ప్రతీ మహిళకు ఉద్యమ్ ఆధార్ తప్పనిసరి
- కార్డు పొందడంలో ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఇబ్బందులు
- పాన్, ఆధార్‌తో అనుసంధానమై ఉండాలన్న నిబంధన
- ఆన్‌లైన్ సెంటర్ల వెంట మహిళల ప్రదక్షిణ

మంచిర్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) లింకేజీ విషయంలో బ్యాంకర్లు కొత్త మెలిక పెట్టారు. ఎస్‌హెచ్‌జీ ద్వారా రుణం తీసుకొనే ప్రతీ మహిళ ఉద్యమ్ ఆధార్ తప్పనిసరిగా కలిగి ఉండాలని చెబుతుండటంతో సభ్యులందరూ అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికిప్పుడు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి రావడంతో ఆన్‌లైన్ సెంటర్ల వైపు పరుగులు పెడుతున్నారు. సాధారణంగా చిన్న తరహా పరిశ్రమలు స్థాపించేవారు తమ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించడానికి ఉద్యమ్ ఆధార్ తప్పనిసరిగా తీసుకోవలసి ఉంటుందని బ్యాంకర్లు చెబుతున్నాయి. అయితే ఉద్యమ్ ఆధార్‌ను ప్రభుత్వ రుణంతో స్వయం ఉపాధి పొందే సంఘాలకు కూడా వర్తింపజేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎస్‌హెచ్‌సీ సభ్యులు ఉద్యమ్ ఆధార్ కార్డు తీసుకోవడం ఇబ్బందిగా మారింది. సంఘం తరుపున కనిష్టంగా లక్ష రూపాయల నుంచి గరిష్టంగా రూ. 20 లక్షల వరకు రుణం తీసుకునే వారందరూ ఉద్యమ్ ఆధార్ ధృవీకరణ పత్రం జత చేయాలన్న నిబంధన విధించడంతో తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.

ఉద్యమ్ ఆధార్ అంటే...?

ఇది భారత దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం ఉద్దేశించిన కాగిత రహిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ. ఈ రిజిస్ట్రేషన్ అనంతరం ఒక ప్రత్యేకమైన పన్నెండు అంకెల సంఖ్య లభిస్తుంది. ఈ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందడం ద్వారా వ్యాపారాలకు సంబంధించి తక్కువ వడ్డీకి రుణాల మంజూరుతో పాటు ప్రభుత్వపథకాలు, ఇతర ప్రయోజనాలు అందుతాయి. 2020లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఈవిధానాన్ని ప్రవేశపెట్టింది.

నిబంధనలు ఇవీ...

ఉద్యమ్ ఆధార్ కార్డు తీసుకోవాలంటే రుణం పొందగోరే మహిళ మొదట పాన్‌కార్డు కలిగి ఉండాలి. అది ఆధార్‌కార్డుతో కచ్చితంగా అనుసంధానమై ఉండాలి. రుణం తీసుకునే మహిళలు ఏదో ఒక వ్యాపారం నడుపుతున్నట్లు ట్రేడ్ లైసెన్స్ వంటి డాక్యుమెంట్ తీసుకోవాలి. పైవన్నీ జత చేస్తేనే ఉద్యమ్ ఆధార్ పత్రాన్ని తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో చాలా మంది ఎస్‌హెచ్‌సీ సభ్యులకు పాన్ కార్డులు లేవు. అవి కలిగి ఉన్నవారు ఆధార్‌తో దాన్ని అనుసంధానం చేసుకోలేదు. ఇప్పటి వరకు ఆ అవసరం కూడా వారికి ఏర్పడలేదు. ప్రస్తుతం రుణాలు అవసరం కనుక ఇప్పటికిప్పుడు పాన్, ఆధార్‌తో లింకు చేయించుకోవాలన్నా కనీసం 15 రోజుల సమయం పడుతుంది. అలాగే ఆన్‌లైన్ సెంటర్లలో రూ. 1500 వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మరోవైపు పాన్, ఆధార్ కార్డుల్లోని పేర్లలో ఏ చిన్న తప్పు దొర్లినా మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఈ ప్రక్రియ అంతా మెప్మా సభ్యులకు భారంగా, కష్టతరంగా మారింది. దీంతో బ్యాంకుల్లో రుణాలు తీసుకునే అవకాశం లేకుండా పోతుందనే ఆవేదనలు వ్యక్తం అవుతున్నాయి.

ఉద్యమ్ ఆధార్ నమోదు ఇలా...

మొదట అధికారిక ప్రభుత్వ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ https://udyamregistration.gov.in/లోకి వెళ్లాలి.'ఎంఎస్ఎంగా ఇప్పటి వరకు నమోదు చేసుకోని కొత్త వ్యవస్థాపకులు లేదా ఈఎం-2 ఉన్నవారి కోసం' అన్న దానిపై క్లిక్ చేయాలి. ఆధార్ కార్డులో ఉన్న విధంగా ఆధార్ నెంబర్, వ్యవస్థాపకుని పేరు నమోదు చేయాలి. తర్వాత వ్యాలిడేట్ అండ్ జనరేట్ ఓ టీపైకి క్లిక్ చేయాలి. ధృవీకరించిన తరువాత సంస్థకు సంబంధించిన అవసరమైన సమాచారాన్ని నమోదు చేయాలి. బ్యాంకు ఖాతా నెంబరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో సహా సంస్థ బ్యాంకు.. (తరువాయి 7లో)

పాఠశాలల్లో పిచ్చి మొక్కల తొలగింపు

● కృతజ్ఞతలు తెలిపిన సిబ్బంది


పాఠశాలలో బ్లేడ్ ట్రాక్టర్‌తో తొలగిస్తున్న పిచ్చి మొక్కలు

మందమర్రిటౌన్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జి. లింగయ్య అసోసియేట్ ప్రొఫెసర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్లేడు ట్రాక్టర్‌తో పిచ్చి మొక్కలు తొలగించారు. పాఠశాల ఆవరణలో గత కొద్ది నెలలుగా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాముల సంచారం పెరిగింది. ఈ విషయాన్ని పాఠశాల సిబ్బంది స్వచ్ఛంద సంస్థకు తెలియజేయడంతో చెత్తచెదారం తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు అందులోని పిచ్చిమొక్కలను, గడ్డిని తొలగించి శుభ్రం చేశారు. దీంతో పాఠశాల సిబ్బంది స్వచ్ఛంద సేవా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేగాకుండా వర్షపు నీటితో బురదమయం అవుతుందని ఈ పనులు కూడ చేపట్టాలని కోరారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు త్వరలోనే మందమర్రి జీఎంతో పాటు ఇతర అధికారులను కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నస్పూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ మందక్రిష్ణ మాదిగ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రయ్యకు వినతి పత్రం అందించారు. ప్రధాన రహదారి వద్ద నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు నల్ల కండువాల ధరించి కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీజే పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి శిక్షపడే విధంగా దర్యాప్తు చేయాలన్నారు.

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు శ్రీనివాస్, బానయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

జన్నారం, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీసీకులాల ఉద్యమ పోరాట సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి జీవో 9ని విడుదల చేసిందని హైకోర్టులో కేసు వేయడంతో స్టే విధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ కడార్ల నర్సయ్య, నాయకులు లక్ష్మీనారాయణ, అశోక్, రావుల శంకర్, గోపాల్, మామిడి విజయ్, రాజన్న, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

శ్రీరాంపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ లాడ్స్ నిధులు రూ. 6.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. వివేక్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యదర్శి, సింగరేణి బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి బరపటి మారుతి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. రోడ్డు కావాలని అడుగగానే నిధులు మంజూరు చేసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు మారుతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సంఘం సదానందం, ఆటో యూనియన్ అధ్యక్షుడు రాగిడి రాజు, నాయకులు సమ్మన్న, కొల్లూరి మల్లేష్, రాంరెడ్డి, లశెట్టి శ్రీనివాస్, మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

గుండా మల్లేష్ సేవలు చిరస్మరణీయం


గుండా మల్లేష్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నేత మాజీ ఎమ్మెల్యే దివంగత గుండా మల్లేష్ సేవలు చిరస్మరణీయమని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, నాయకులు అన్నారు. సోమవారం దివంగత గుండా మల్లేశ్ 5వ వర్ధంతి సందర్భంగా సీపీఐ నాయకులు చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలిచి ప్రజల సంక్షేమానికి కృషి చేశారన్నారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించి భారత కమ్యూనిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి ప్రజా సేవకే జీవితాన్ని అంకితం చేశారన్నారు. బడుగు, బలహీన పేద వర్గాల ప్రజల కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గుండా మల్లేశ్ పదవి కాలంలో ఎంతో మంది నిరుపేదలకు భూమి, ఇల్లు, పంపిణీ చేశారని పేర్కొన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం ఎళ్లవేలలా ముందున్న మహనీయుడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కామెర మల్లయ్య, బొంతల లక్ష్మీనారాయణ, సరోజ, రాజేశ్, అంబేద్కర్, చంద్రమాణిక్యం, రత్నం రాజం, ప్రశాంత్, సమ్మయ్యలు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమాల్లో గుండా మల్లేష్‌ది పెద్దన్న పాత్ర

మంచిర్యాల కలెక్టరేట్ : కార్మిక ఉద్యమాల్లో గుండా మల్లేష్‌ది పెద్దన్న పాత్ర అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, పట్టణ కార్యదర్శి కలిందర్ అలీఖాన్‌లు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో గుండా మల్లేష్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేగా నియోజక వర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగం రవి, పౌలు, కిషన్‌రావు, సత్యనారాయణ, పోచన్న, శంకరయ్య, మొగిలి, లక్ష్మణ్, సాంబయ్య, మొండయ్య, రాయమల్లు, శంకర్ పాల్గొన్నారు.

కాసిపేట : దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ వర్ధంతిని సీపీఐ నాయకులు సోమవారం సోమగూడెంలో ఘనంగా నిర్వహించారు. గుండా మల్లేష్ చిత్రపటానికి సీపీఐ మండల కార్యదర్శి దాగం మల్లేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాడి పోచం, కుర్సెంగ హన్మంతు, గట్టయ్య, గట్టు సర్వేశం, దాగం రాజలింగు, బండారి సత్తయ్య, పులి శంకర్, దుర్గం పోశం పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి

● సీపీ అంబర్ కిషోర్ ఝా


పోలీసు సిబ్బందికి స్కిట్ ఆర్టికల్స్ పంపిణీ చేస్తున్న రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాలక్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో పని చేసే పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న సిబ్బందికి చలి, వర్షానికి ఉన్ని దుప్పటి, ఉలెన్ జాకెట్, కాటన్ టీషర్టులు, రెయిన్ కోట్, కిట్ ఆర్టికల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధులు నిర్వర్తించే సిబ్బంది ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఆర్ఐ దామోదర్, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీల్లో పాల్గొనాలి

పోలీసు అమరుల ప్రాణ త్యాగాలసంస్మరణలో భాగంగా అక్టోబరు 21న నిర్వహించే అమర వీరుల సంస్మరణ దినోత్సవం పోలీసు ఫ్లాగ్‌డే సందర్భంగా నిర్వహించే వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని అన్నారు. రాష్ట్ర పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీలు తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూభాషల్లో ఉంటాయని ఆరు నుంచి పీజీ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. అక్టోబరు 28వ తేదీలోగా సమర్పించాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. రామగుండం పోలీసుకమిషనరేట్ స్థాయిలో మొదటి, రెండో, మూడో స్థానాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండగలరు అనే అంశంపై ఉంటుందని, వ్యాసాన్ని పేపర్‌పై రాసి ఫొటోతీసి పీడీఎఫ్ ఫార్మట్‌లో 500 పదాలకు మించకుండా https://forms.gle/jaWLdt2yhNr Mpe3e Aలో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల సమన్వయంతో కృషి చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్జీదారుల నుంచిదరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 43 దరఖాస్తులు వచ్చాయని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్‌చంద్రయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల విద్యార్థిని సఫురా ఫాతిమాను కలెక్టర్ కుమార్ దీపక్ ఘనంగా సన్మానించారు. మైనార్టీ సంక్షేమాధికారి రాజేశ్వరి, ప్రాంతీయ స్థాయి సమన్వయకర్త రాజేందర్ పాల్గొన్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మూడో స్థానం

మంచిర్యాల క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 19 రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 3వ స్థానంలో నిలిచింది. 69వ కబడ్డి రాష్ట్రస్థాయి పోటీలు మహబూబాబాద్ కొమ్ము వంచలో 10,11,12 తేదీల్లో నిర్వహించగా మొదటి స్థానంలో మహబూబ్‌నగర్, రెండో స్థానంలో మెదక్, మూడో స్థానంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిలిచింది. ఈ సందర్భంగా మంచిర్యాలకు వచ్చిన టీంను కోచ్ మేనేజర్ సుదీప్, సాంబమూర్తి, రాజన్న, సీఏటీవో అంజయ్య, గేమ్స్ కార్యదర్శి బాబురావు, కబడ్డి అసోసియేషన్ సభ్యులు రాంచందర్, కార్తిక్, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి అభినందించారు.


ప్రశంస పత్రాలు అందుకుంటున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కబడ్డి టీం

ఉమ్మడి జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

నస్పూర్, అక్టోంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని కేజీపీ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌జీఎఫ్ అండర్- 14,17,19 బాలబాలికల జిల్లాస్థాయి, ఉమ్మడి జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు జరిగాయి. ఎస్‌జీఎఫ్-19 కార్యదర్శి బాబురావు, అండర్ -14,17 కార్యదర్శి ఎండీ యాకూబ్‌లు పోటీలను ప్రారంభించారు. జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరై ప్రతిభ కనబర్చారు. ఆదిలాబాద్ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మహేష్, ఆర్గనైజర్ దేవేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ వేణు, సీనియర్ పీడీ రాజన్న, పీడీలు సురేష్, విశాల, పీఈటీలు పాల్గొన్నారు.


ఉమ్మడి జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు